సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



చిత్తు కాగితాలు సేకరిస్తూ...

రోడ్లపై చిత్తు కాగితాలు సేకరిస్తూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్నారు. జోగిపేట పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. 8లో

టీవీ పెట్టొద్దు.. పని చెప్పొద్దు



పదో తరగతి విద్యార్థులకు ఈనెల రోజులు కీలకం. వారికి ఎలాంటి పని చెప్పొద్దని తల్లిదండ్రులకు మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. 8లో



ప్రణాళికాబద్ధంగా అమీన్‌పూర్ అభివృద్ధి

మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. 9లో

సమస్య మీది పరిష్కారం మాది

నేడు జోగిపేట మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు, కోతులు విచ్చల విడిగా స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నివారణ చర్యలతో పాటు మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలపై కాల్ చేయవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, వీధి దీపాల అంశాలపై మున్సిపల్ కమిషనర్ రవిబాబుతో మాట్లాడవచ్చు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సందేహాలను తీర్చుకోవచ్చు.





తేదీ : 26-02-2023

సమయం: ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

83408 17917

కుక్కల బెడదను తొలగిస్తాం

- యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతాం..
- మున్సిపల్ సమస్యలను పరిష్కరిస్తాం
- సదాశివపేట మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి
- 'సాక్షి ఫోన్ ఇన్'కు అనూహ్య స్పందన



ఫోన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద అధికమైందని, వాటి నుంచి రక్షించాలని సదాశివపేట మున్సిపాలిటీ ప్రజలు కోరారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రజలు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కుక్కల బెడదతో పాటు మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కుక్కలు, కోతుల బెడదను సాధ్యమైనంత త్వరగా తొలగిస్తామన్నారు. మున్సిపాలిటీ సమస్యల పరిష్కారంపై సైతం దృష్టి సారిస్తామన్నారు.

సదాశివపేట పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి నుంచి కాపాడండి.

– దత్తు, గురునగర్ కాలనీ

మున్సిపల్ కమిషనర్: కుక్కల బెడదను నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి.

పట్టణంలో మిషన్ భగీరథ పనులతో ప్రధాన, అంతర్గత రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. త్వరగా పనులు పూర్తి చేసి రోడ్లను బాగు చేయాలి

– విశాల్, టీజీఎఫ్ పట్టణ అధ్యక్షుడు

కమిషనర్: పట్టణ పరిధిలో మిషన్ భగీరథ కింద ప్రధాన, అంతర్గత రోడ్ల వెంబడి పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయి. మార్చి నెలాఖరు వరకు పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తాం. పట్టణ ప్రజలు సహకరించాలి.

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ కుక్కలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వెంటపడుతున్నాయి. పిల్లలు, పెద్దలు వాటితో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపండి.

– మన్నన్, ఫెరోజ్, ఇబ్రహీం, భవాని, ప్రవీణ్, ఎస్.రమేశ్

కమిషనర్: మున్సిపల్ పరిధిలోని 26 వార్డుల్లో కుక్కల బెడదను నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ రుపొందించి అమలు చేస్తాం. వార్డుల్లో ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే మున్సిపల్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలి. వీధికుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కుక్కలు వీధుల్లో ఎక్కువగా సంచరిస్తుంటే మున్సిపల్ అధికారులకు గాని, లేదా 9849905918 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. తగిన చర్యలు తీసుకుంటాం.

మిషన్ భగీరథ కింద తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పాత పైప్‌లైన్ నుంచి నీటిని సరఫరా చేయవద్దని నిబంధనలు ఉన్నాయి. పైప్‌లైన్ల లీకేజీలతో నీరు వృథా అవుతోంది.

– పి.యాదగిరి, 16వ వార్డు

కమిషనర్: ఇంటింటికీ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నాం. పాత, కొత్త పైప్‌లైన్ వ్యవస్థల ద్వారా ఇంటింటికీ నీరు సరఫరా అవుతోంది. పాత పైప్‌లైన్‌లకు లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చూస్తున్నాం.

భవన నిర్మాణాల అనుమతుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

– కూర శేఖర్, 6వ వార్డు

కమిషనర్: నిర్మాణాల అనుమతులకు టీఎస్ బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అన్ని సరిగా ఉంటే అనుమతులు ఇస్తారు. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకపోతే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

కృష్ణానగర్ కాలనీలో ముళ్లపొదలు, కచ్చా కాల్వల సమస్యను పరిష్కరించండి.

– గుండు రవికుమార్, 6వ వార్డు కౌన్సిలర్

కమిషనర్: కృష్ణానగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో పెరిగిన ముళ్లపొదలను తొలగిస్తాం. కచ్చా కాల్వల స్థానంలో మురుగు నీటి సరఫరాకు డ్రెయినేజీలు నిర్మిస్తాం. పారిశుధ్య సమస్య లేకుండా చూస్తాం.

ఇటుక బట్టీల పరిశీలన

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం దర్గా తండా సమీపంలోని ఇటుకబట్టీలను శనివారం నారాయణఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జ్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్లా, డీఎస్పీ జె.వెంకట్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఇటీవల దర్గాతండా ఇటుకబట్టీల్లో ఒడిశా కూలీలను నలుగురు నిర్వాహకులు వేధింపులతోపాటు ఏడుగురు మైనర్ బాలికలను లైంగికంగా వేధిస్తున్నట్లు కూలీలు తమ బంధువుల సహాయంతో ఒడిశా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో అధికారులు వారం కింద పరిశీలించి వేధింపులు నిజమేనని తేల్చారు. తనిఖీల్లో బయటపడిన ఆధారాలతో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈనేపథ్యంలో న్యాయమూర్తి ఇటుక బట్టీలను పరిశీలించారు. పనిచేస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన కూలీలతో మాట్లాడారు. కూలీ, కల్పిస్తున్న సదుపాయాలు, ఇబ్బందులు, సమస్యలను తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.



ఇటుకబట్టీని పరిశీలిస్తున్న న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్లా

న్యూస్‌రీల్

మౌలిక వసతుల కల్పనకు కృషి

జిల్లా విద్యాధికారి రాజేశ్

పటాన్‌చెరు టౌన్: మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని, జిల్లాలో 441 ప్రభుత్వ పాఠశాలను మొదటి విడతలో ఎంపిక చేశామని జిల్లా విద్యాధికారి రాజేశ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. విద్యార్థులను చదివించడంపై ఉపాధ్యాయులకు ఎంత బాధ్యత ఉందో అంతే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులను పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్, రుద్రారం సర్పంచ్ సుధీర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



క్రీడాకారులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం బాగారెడ్డి స్టేడియంలో సన్‌రోయ్ ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, స్నేహాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో రవీందర్‌పాటిల్, నసీర్, బీఆర్ఎస్ నాయకులు మొహియొద్దీన్, మిథున్‌రాజ్, బాబీ, సత్యం, ముర్తుజా, యూనస్, లవన్, ఉపేందర్, ఇరిమ్మయా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శనివారం సంగారెడ్డిలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రంలో నర్సింగ్ విద్యార్థినులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు మహిళా చట్టాలపై, గృహహింస, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. మహిళలు తమ రక్షణ కోసం షీ టీంలు, న్యాయస్థానాలను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నీలిమ, సౌజన్య, మహిళా వికాస కేంద్రం మేనేజర్ సుగుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విద్య, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన బడి పనులను లక్ష్యం మేరకు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల నాణ్యతలో రాజీపడరాదన్నారు. ఆయా శాఖల ఈఈలు ఎప్పటికప్పుడు డీఈలు, ఏఈలతో పనుల పురోగతిపై సమీక్షించాలన్నారు. కొన్ని మండలాల్లో లక్ష్యం మేరకు పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు బాగా చేస్తున్న ఏఈ, డీఈలను అభినందించారు. పూర్తయిన పనులకు సంబంధించి వెంటనే ఎఫ్‌టీఓలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠశాలలకు వేస్తున్న పెయింటింగ్ క్వాలిటీ బాగుండాలని ఏజెన్సీలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా విద్యాధికారి రాజేశ్, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, డీఈలు, ఏఈలు, పెయింటింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, డ్యూయల్ డెస్కుల సప్లయర్స్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ పనులను వెంటనే ప్రారంభించాలి

జిల్లాలో బీటీ రోడ్డు రెన్యూవల్ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. బీటీ రెన్యువల్‌కు సంబంధించి ఆయా ఏజెన్సీలు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. టెండరు, అగ్రిమెంట్లు కానివాటిని త్వరగా పూర్తిచేసి పనులు చేపట్టాలన్నారు. పేమెంట్‌కి సంబంధించి ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, ఈఈ సురేశ్‌కుమార్, డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అలాగే మరో కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కోసం శనివారం ప్రత్యేకంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరం విజయవంతమైందని తెలిపారు. సంగారెడ్డిలోని సేయింట్ ఆంటోని డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో 199 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శనివారం మార్క్‌ఫెడ్, వరము రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శనగలు క్వింటాలుకు రూ.5,335 మద్దతు ధర ఉందన్నారు. అనంతరం మండలంలోని నల్లంపల్లి చౌరస్తా నుంచి పీపడ్‌పల్లి వరకు తొమ్మిది కిలోమీటర్ల మేర రూ.2.45 కోట్ల నిధులతో నిర్మించే పంచాయతీ రాజ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. హస్నాబాద్ గ్రామంలో జిల్లా, మండల పశువైద్యాధికారులు వసంతకుమారి, శర్షవర్ధన్‌రెడ్డిలతో కలిసి జీవాలకు నట్టల నివారణ మందును వేశారు. గంగామాత వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మమత అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధప్ప పాటిల్, తదితరులు ఉన్నారు.

విద్యార్థికి టికెట్ సొమ్ము ఇవ్వండి

సంగారెడ్డి వినియోగదారుల ఫోరం తీర్పు



పటాన్‌చెరు: అమీన్‌పూర్‌కు చెందిన విద్యార్థి ఉన్నత చదువుల కోసం క్లీవ్‌ల్యాండ్(యూఎస్)కు వెళ్దామని వీసాతో పాటు ఫ్లైట్ ఎక్కాడు. ఢిల్లీ వెళ్లాక ఆయనను ఫ్లైట్ ఎక్కనివ్వలేదు. ఏమంటే కోవిడ్ నిబంధనలని ఏయిర్‌లైన్స్ వారి సమాధానం. చేసేదేమీ లేక తిరిగి వచ్చేశారు. తన టిక్కెట్ సొమ్మును వాపసు ఇవ్వాలని కోరినా ఫలితం లేదు. తప్పు మీదేనంటూ ట్రావెల్ ఏజెన్సీ, ఏయిర్‌లైన్స్ సంస్థలు వాదించాయి. దీంతో ఆ విద్యార్థి, అతడి తండ్రితో కలిసి వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఏయిర్‌లైన్స్ నిర్వాకాన్ని తప్పు పట్టిన ఫోరం టిక్కెట్ సొమ్మును వడ్డీతో సహా చెల్లించాలని తీర్పునిచ్చింది. కోవిడ్ నిబంధనలను వినియోగదారుడికి చెప్పాల్సిన బాధ్యత ఏయిర్‌లైన్స్, ట్రావెల్ ఏజెన్సీదేనని ఫోరం అభిప్రాయపడింది. టిక్కెట్ జారీ చేసే క్రమంలోనే ఆ వివరాలను వినియోగదారుడికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వివరాల్లోకి వెళ్తే.. అమీన్‌పూర్‌కు చెందిన అనాస్ అహ్మద్ ఉన్నత విద్య కోసం వీసా ఉండటంతో క్లీవ్‌ల్యాండ్ వెళ్లేందుకు టిక్కెట్ తీసుకున్నాడు. మొత్తం నాలుగు ఫ్లైట్లలో ఆయన వివిధ ప్రాంతాల గుండా క్లీవ్‌ల్యాండ్ చేరాలి. ఆ మేరకు ట్రావెల్ ఏజెన్సీ టిక్కెట్లు ఇప్పించింది. 12 ఆగస్టు 2021న హైదరాబాద్ నుంచి ఢిల్లీ ఇండిగో ఫ్లైట్‌లో వెళ్లాడు. అక్కడి నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ ఏఎం(జర్మన్)కు విస్తార ఏయిర్‌లైన్స్‌లో వెళ్లాల్సి ఉంది. అక్కడ నుంచి న్యూయార్క్ ఆ తర్వాత యూఎస్‌కు ఇతర విమాన సంస్థల్లో వెళ్లాలని ఫ్లిప్‌కార్ట్ సంస్థ(ట్రావెల్ ఏజెన్సీ) టిక్కెట్లు ఇప్పించింది. టిక్కెట్‌కు రూ.1,76,443 ఖర్చు అయ్యింది. ఢిల్లీ నుంచి జర్మనీ ఫ్రాంక్‌ఫర్ట్ విమానంలో వెళ్లాల్సి ఉన్న కారణంగా ఢిల్లీ ట్రాన్సిట్ వీసా అవసరమైంది. కోవిడ్ నిబంధనల కారణంగా ఆ వీసా దొరకలేదు. విస్తార ఏయిర్‌లైన్స్ వారు ఆ విద్యార్థిని ఫ్లైట్‌లోకి అనుమతించలేదు. ఢిల్లీ నుంచి అమీన్‌పూర్‌కు తిరిగి వచ్చేశాడు. ఆ తర్వాత టిక్కెట్ సొమ్ము రీఫండ్ కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కోవిడ్ నిబంధనల కారణంగా ఆ విద్యార్థికి ఇబ్బంది కలిగిందని తమకు ఏమాత్రం సంబంధం లేదని ఏయిర్‌లైన్స్, టిక్కెట్ ఇప్పించిన ఫ్లిప్ కార్ట్ సంస్థలు తేల్చి టిక్కెట్ సొమ్ము రిఫండ్‌పై సమాధానం ఇవ్వలేదు. నేటికీ ఆ సొమ్మును వాపసు ఇవ్వలేదు. దీంతో తనకు జరిగిన నష్టంతో పాటు టిక్కెట్ సొమ్ము ఇవ్వాలని ఆ విద్యార్థి తండ్రి షేక్ ఇర్ఫాన్ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. సంగారెడ్డి జిల్లా ఫోరం అధ్యక్షురాలు పి.కస్తూరి, సభ్యులు గజ్జల వెంకటేశం, ఎం.విజయకుమార్‌ల ఇచ్చిన తీర్పు మేరకు అహ్మద్ ఖాన్‌కు జరిగిన నష్టానికి గాను టిక్కెట్ సొమ్ము(రూ.1,76,443)ను తొమ్మిది శాతం వడ్డీతో రీఫండ్ చేయాలని ఆదేశించారు. అలాగే రూ.50 వేలు నష్టపరిహారంగా, రూ.5 వేలు కోర్టు ఖర్చులుగా ఇవ్వాలని ఫోరం తీర్పులో స్పష్టం చేశారు. 40 రోజుల్లో ఆ సొమ్మును రిఫండ్ చేయాలని సూచించారు. వినియోగదారుల పక్షాన న్యాయవాది పూర్ణిమ ఠాకూర్, సంగారెడ్డిలోని జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసును వాదించారు. ఆమె ఆ తీర్పు వివరాలను, తీర్పు కాపీ ప్రతులను విలేకరులకు వెలువరించారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర ధరలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

కొండాపూర్(సంగారెడ్డి): ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం వచ్చిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుక్క రాములు పతాకావిష్కరణ చేశారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ ఆర్థిక మాంద్యంతో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరుగుతున్నాయని, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. భారత్‌లో మూడేళ్లుగా ఉత్పాదకత తగ్గిందని, ఉపాధి అవకాశాలు పెరగడం లేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు కోత విధించడం నేరపూరిత చర్యగా అభివర్ణించారు. నూతన విద్యా విధానంతో పేదలకు విద్యను దూరంచేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలపై వేటు వేసిందని, ప్రజల సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదల సమస్యలను పరిష్కరించకపోతే బీఆర్ఎస్‌పై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరం మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, రాంచందర్, నరసింహారెడ్డి, సాయిలు ఉన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

కంది(సంగారెడ్డి): మండలంలోని మామిడిపల్లి శివారులో కురుమ సంఘం భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని శనివారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. మంత్రి హరీశ్‌రావు ఆదివారం కురుమసంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడిపల్లికి చెందిన కొందరు పూర్వీకుల నుంచి సాగుచేసుకుంటున్న భూమిని సర్వేచేయించి తమకు ఇవ్వాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. త్వరలో సర్వేచేయించి స్థలం అప్పగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్డీఓ నగేశ్, తహసీల్దార్ విజయలక్ష్మి, రూరల్ సీఐ శివలింగం, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ మల్లికార్జున్ గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

'ఉపాధి'లో నం.1

- ఈజీఎస్ అమలులో సంగారెడ్డి మొదటి స్థానం
- రెండో స్థానంలో మెదక్.. సిద్దిపేట ఆరో స్థానం
- రోజుకు 40 వేల మంది పనులకు హాజరు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పనుల్లో సంగారెడ్డి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుస్తోంది. అన్ని జిల్లాల కంటే సంగారెడ్డిలో అత్యధిక సంఖ్యలో కూలీలు పనులకు వెళ్తున్నారు. రెండో స్థానంలో మెదక్ జిల్లా ఉండగా, ఆరో స్థానంలో సిద్దిపేట్ జిల్లా నిలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 40 వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

- గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నివారించి, స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 647 గ్రామ పంచాయతీల పరిధిలో 2.29 లక్షల జాబ్ కార్డులున్నాయి. మొత్తం 4.26 లక్షల మంది కూలీలు ఉండగా, ఇందులో ప్రస్తుతం 2.33 లక్షల మంది మాత్రమే తరచూ ఉపాధిహామీ పనులకు వెళ్తున్నట్లు గుర్తించారు. అయితే కూలీల హాజరులో సంగారెడ్డి ప్రథమ స్థానంలో నిలుస్తోంది.
- రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో కలిపి ప్రస్తుతం ప్రతిరోజు 4.43 లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతుండగా, ఇందులో సుమారు పది శాతం మంది కూలీలు ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే పనులకు వెళ్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఫలిస్తున్న కలెక్టర్ చర్యలు

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచేందుకు కలెక్టర్ శరత్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ పనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ఏపీఓలు, ఎంపీఓలు, ఎంపీడీఓలతో ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలకు అప్పగించారు. సంబంధిత శాఖల ఏపీడీలు, జిల్లా పరిషత్ అధికారులతో ఉపాధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. దీంతో కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలుస్తోంది.

శుక్రవారం ఉపాధి హామీ పనులు.. కూలీల వివరాలు

జిల్లా	గ్రామాలు	పనులు చేస్తున్న కూలీలు
సంగారెడ్డి	636	39,503
మెదక్	468	24,682
సిద్దిపేట	492	17,492

మెటీరియల్ కాంపోనెంట్

కూలీల సంఖ్య పెరిగితే ఉపాధి హామీ పనులు విస్తతమవుతాయి. తద్వారా లేబర్ కాంపోనెంట్ నిధులు పెరగడంతో పాటు అదే స్థాయిలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు జనరేట్ అవుతాయి. ఇలా జనరేట్ అయిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు వీలవుతుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మనబడి పథకానికి ఈ ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వినియోగిస్తున్నారు. కూలీలు ఎక్కువ పనిచేయడం ద్వారా ఎక్కువ నిధులను వినియోగించుకునేందుకు వీలు కలుగుతుంది.

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం



జిల్లాలో ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఈ పనులకు వచ్చేలా వారిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. తద్వారా అత్యధిక సంఖ్యలో కూలీలు పనులకు హాజరవుతున్నారు.

– శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీఓ, సంగారెడ్డి

క్లుప్తంగా

వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు లభ్యం


కోమటి చెరువులో నీటిలో తేలుతున్న మృతదేహం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట కోమటి చెరువులో శనివారం గుర్తు తెలియని శవం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, ఐదున్నర అడుగుల ఎత్తు, గడ్డం, నలుపు రంగు పూల షర్ట్ బొమ్మలు, నలుపు రంగు పాయింట్, బూట్లు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ 9490617019, 9490617058 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

సంగారెడ్డిటౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం చింతలపల్లి గ్రామ శివారు చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాగపూర్ సర్పంచ్ కటకం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 56719, 87126 56746 నంబర్లకు తెలపాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ మరో బైక్ ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట బీఎస్ఆర్ కాలనీకి చెందిన మెహబూబ్ మోహిన్ పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం బిషిఫ్ట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. పోలీసు చెక్ పోస్టు దాటిన తర్వాత ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్ ఢీ కొట్టింది. దీంతో మెహబూబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం మదీనగూడ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ వైద్యులు పరిశీలించి చేయి మణికట్టు విరిగినట్లు చెప్పారు.

టీవీ పెట్టొద్దు.. పనులు చెప్పొద్దు

పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు మంత్రి హరీశ్ దిశానిర్దేశం


హైదరాబాద్ నుంచి వస్తూ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: అఖిల మీ బిడ్డ దిశ మంచిగా చదువుతుందా? తెల్లవారుజామున లేపి చదివిస్తున్నారా? నేను రాసిన ఉత్తరం అందిందా? ఈ ఒక్క నెలరోజులు గట్టిగా పిల్లల గురించి మనస్సు పెట్టుండ్రి. అశోక్ మీ కొడుకు అభిలాష్ ఎట్లా చదువుతున్నాడు. ప్రొద్దున్నే లేస్తున్నాడా. టీవీలు పెట్టి వాళ్ళ మనస్సు దృష్టి పక్కదారి పట్టించొద్దు. సీరియల్ మాటలు విని పిల్లల చదువు పాడు అవుతుంది. ఇలా సుమారు గంటన్నర పాటు దారి పొడవునా పదుల సంఖ్యలో నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులతో రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఫోన్ ద్వారా పిల్లల చదువు స్థితిగతులు గురించి ఆరా తీయడంతో పాటు తల్లిదండ్రులకు నెలరోజుల కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికపై హితోపదేశం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా పర్యటనకు బయలుదేరిన మంత్రి దారి పొడవునా తన వాహనం నుంచి నేరుగా జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు స్వయంగా ఫోన్ చేసి ఆరా తీశారు. ప్రొద్దున్నే పిల్లలను నిద్ర లేపుతున్నారా? లేదా? అని ఒక్కొకరిని ప్రశ్నించారు. నిద్ర లేపి మంచిగా చదివించాలని, గ్రామాల్లో వ్యవసాయదారులు పొలం పనులకు వెళ్లే మసక సమయంలో పిల్లలను లేపి చదువుకునేలా చూసి వెళ్లాలని సూచించారు. ఇంటిలో టీవీ పెట్టొదని, బిగ్గరగా ఇంటి సభ్యులు ఫోన్ ముచ్చట్లు చేయొద్దని, దీని వల్ల పిల్లల చదువు డిస్టర్బ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని కొన్ని సూచనలు చేశారు. కొద్ది రోజుల పాటు తల్లిదండ్రులు పదో తరగతి పరీక్షలు రాసే పిల్లలకు ఎలాంటి పనులు చెప్పొదన్నారు. మీ పిల్లల చదువు కోసం తాను నా పిల్లల చదువు లెక్క పడుతున్న తండ్లాడుతున్న కష్టాన్ని గురించి వివరిస్తూ, మీరు కూడా కొంచెం శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. ఒక దశలో కొందరి తల్లిదండ్రులతో మీ పిల్లలు పెద్ద అయ్యాక ఏమి అవుతారని, వారి లక్ష్యం ఏమిటని తెలుసుకున్నారు. పాఠశాలలలో రెండు గంటలు అదనంగా ప్రత్యేక క్లాసులు చెప్పాలని, సార్లకు చెప్పడం జరిగిందని, అలా చెబుతున్నారా అని ఆరా తీశారు.

అగ్ర స్థానంలో నిలవాలి

పది ఫలితాల్లో మళ్లీ మనమే ఫస్ట్ రావాలి అలా అందరూ కషి చేయాలని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు దిశానిర్దేశం చేశారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత విద్యాశాఖ, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల, కస్తూర్బా, మోడల్ స్కూల్ పాఠశాలల ప్రతినిధులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దిశానిర్దేశం చేశారు. పది ఫలితాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని, సీఎం కేసీఆర్ జిల్లా పేరు మరోసారి ఫలితాల్లో మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. 10 జీపీఏ సాధించిన వారికి రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తానని ఆదిశగా అందరినీ ప్రోత్సహించాలన్నారు.

ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, సాక్ష్యం చెప్పే సమయంలో సాక్షులకు కోర్టులో సాక్ష్యం చెప్పే విధంగా మోటివేట్ చేయాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ పోలీసు సిబ్బందికి సూచించారు. సీపీ శ్వేత ఆదేశానుసారం క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, పోక్సో కేసుల్లో శిక్షల శాతం పెంచడం, తదితర అంశాలపై సీపీ కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ ప్రతీ కోర్టు కానిస్టేబుల్ కోర్టు కేలెండర్ తయారు చేసుకోవాలన్నారు. నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలని సూచించారు. నేరస్థులకు శిక్ష పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. సమావేశంలో సీసీ ఆర్బీ సీఐ గురుస్వామి, సీసీ ఆర్బీ ఎస్ఐ, ఐటీ కోర్ ఎస్ఐ, కోర్టు లైజనింగ్ అధికారి, సీసీ ఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సదానందం గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే సత్తా ఎస్టీయూ టీఎస్‌కు మాత్రమే ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ అన్నారు. శనివారం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాలలో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావును గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ టీఎస్, ఉమ్మడి ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల అభ్యర్థి భుజంగరావును పాఠశాలల పరిరక్షణకై గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ శర్మ, నమస్తే ఉపాధ్యాయ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, స్థానిక నాయకులు విజయ్ కుమార్, గోపాల్, పండరి, ప్రకాశ్, ప్రతాప్ రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మంజుల (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని దానంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పేట ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం బాచేపల్లి గ్రామానికి చెందిన మంజుల(30)కు దానంపల్లికి చెందిన పల్వంచ గోపాల్‌తో వివాహం జరిగింది. భార్యభర్తలు గొడవపడిన నేపథ్యంలో మంజుల శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె చనిపోవడానికి భర్త గోపాలే కారణమంటూ మంజుల తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఎస్ఐ ఇరు వర్గాలను సముదాయించి, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తు కాగితాలు సేకరిస్తూ...

- తాళం వేసిన ఇంట్లో చోరీ
- దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మహిళలు
- రూ.5 లక్షల విలువ చేసే బంగారం, వెండి, నగదు అపహరణ


సీసీ ఫుటేజీలో మహిళలు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న దృశ్యం

జోగిపేట (అందోల్): రోడ్లపై చిత్తు కాగితాలు సేకరిస్తున్న మహిళలను చూసి పొట్టకూటి కోసం చేస్తున్నారని భావిస్తే పొరపాటే. వీధుల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ వేసి పట్టపగలే చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. జోగిపేట పట్టణంలో ఇలాంటి సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పట్టణంలోని 13వ వార్డులో నివాసం ఉంటున్న కాసాల రాజేశ్వర్ తన కుటుంబంతో కలిసి ఈ నెల 23వ తేదీన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు సంగారెడ్డి వెళ్లాడు. తాళం వేసిన ఇంటిని చూసి ముగ్గురు మహిళలు దొంగతనానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. వేసిన తాళం వేసినట్లుగానే ఉండటంతో వారికి ఎటువంటి అనుమానం కలగలేదు. బీరువాలో ఉండాల్సిన చేతి గడియారం బాక్స్ బయటకు ఎలా వచ్చిందని శనివారం ఉదయం లేచిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి అనుమానం వచ్చింది. తన తండ్రి రాజేశ్వర్‌కు ఈ విషయమై ప్రశ్నించగా తనకు తెలియదని, తాను తీయలేదని చెప్పడంతో బీరువాను తెరచిచూడగా అందులో ఉన్న బంగారం, వెండి, నగదులు కూడా కనిపించకపోయే సరికి ఒక్కసారిగా అవాక్కయ్యారు. వేసిన తాళాలు వేసినట్లే, సామాన్లు చెల్లాచెదురుగా లేకపోయే సరికి కొద్ది సేపు ఆలోచనలో పడ్డారు. ఇంటి యజమాని రాజేశ్వర తన ఇంటి బయట ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పరిశీలించగా గురువారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ముగ్గురు మహిళలు ఇంట్లోకి చొరబడినట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. 2.30 గంటలకు ఇంటి లోనికి ప్రవేశించిన ముగ్గురు మహిళలు 5 నిమిషాల్లో బయటకు రావడం సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యింది. బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదు, 22 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు గ్రహించారు. బాధితుడు రాజేశ్వర్ జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టపగలే మహిళలు దొంగతనానికి పాల్పడటంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి హల్‌చల్


యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్

మెదక్ రూరల్: ఆటో మరమ్మతులకు కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటానంటూ వాటర్‌ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన హవేళిఘనాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. హవేలిఘనపూర్ గ్రామానికి చెందిన కొడకంచి మల్లేశం వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. కాగా తనకు జీవనాధారమైన ఆటో మరమ్మతుకు డబ్బులు ఇవ్వాలని కోరడంతో కుటుంబ సభ్యులు నిరాకరించాడు. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని వైపీఆర్ విద్యా సంస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బిగ్గరగా కేకలు పెట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సురేందర్‌కు ధైర్యం చెప్పి వాటర్ ట్యాంక్ పైనుంచి కిందికి దించారు. కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అరుదైన శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం వైద్యులు ఓ అమ్మాయికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. రోగి పొత్తి కడుపులో నుంచి వెంట్రుకల తుట్టెను విజయవంతంగా తొలగించారు. ఆసుపత్రి సీఈఓ శ్రీనివాస్‌రావు శనివారం శస్త్ర చికిత్స వివరాలు వెల్లడించారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన జిన్నారం లావణ్య, కృష్ణ దంపతుల రెండో కూతురు 12 ఏళ్ల హారిక కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాలేదు. చివరకు లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. రోగిని పరీక్షించిన వైద్యులు పొత్తి కడుపులో వెంట్రుకల తుట్టె ఉన్నట్లుగా గుర్తించారు. శస్త్ర చికిత్స చేసి బయటకు తీశారు. ప్రస్తుతం హారిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆసుపత్రి జనరల్ సర్జన్ డాక్టర్ టి.శ్రీనివాస్, శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ కార్తీక్, మత్తు మందు వైద్యులు డాక్టర్ మురళీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

చేగుంట(తూప్రాన్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని పులిమామాడి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని బోయి వినోదకు చెందిన పూరిగుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పటంకొని కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.55 వేల నగదు, వస్తువులు కాలిపోయాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నర్సింగ్‌యాదవ్ పంచనామా నిర్వహించి అధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు.

పరస్పరం ఫిర్యాదు

దుబ్బాకరూరల్: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు రాళ్లు రువ్వుకున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు భూంపల్లి పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్ఐ గంగారాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


సురేందర్ (ఫైల్)

మెదక్ రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాయితీ సురేందర్ (27) ఈనెల 21వ తేదీన మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద జరిగిన శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహ స్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని బైక్‌పై తిరుగుపయాణమయ్యాడు. మార్గమధ్యలో సాలిపేట శివారులో రోడ్డు పైకి అడవి పంది రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి బైక్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నారాయణ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య చైతన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

గాయపడిన నెమలికి చికిత్స చేయించి..

ఫారెస్ట్ అధికారులకు అప్పగింత


టేకూర్‌లో ఫారెస్ట్ అధికారికి నెమలిని అప్పగిస్తున్న సర్పంచ్ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పొలంలో గాయపడిన జాతీయ పక్షి నెమలిని ఓ రైతు వైద్యం చేయించి రక్షించిన సంఘటన న్యాల్‌కల్ మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రైతుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు దూడ శ్రీశైలం పొలం పనుల నిమిత్తం మధ్యాహ్నం పొలానికి వెళ్లాడు. అక్కడ నెమలి కనిపించింది. చలనం లేకుండా ఉండటంతో వెంటనే గ్రామానికి తీసుకెళ్లి సర్పంచ్‌కు విషయం తెలిపాడు. సర్పంచ్ అమీర్ ఆ సమాచారాన్ని జహీరాబాద్ ఫారెస్ట్ అధికారి ఇనాయత్ అలీకి తెలిపాడు. గ్రామానికి చేరుకున్న ఆయన గాయపడిన నెమలిని న్యాల్‌కల్ పశు వైద్య కేంద్రానికి తీసుకువెళ్లాడు. అక్కడ నెమలికి వైద్యం చేయించి అనంతరం దానిని శంశల్లాపూర్ అడివిలో వదలి వదిలిపెట్టారు. పంట పొలాల చుట్టు రక్షణగా ఉంచిన తీగలు తగిలి నెమలి గాయపడి ఉంటుందని తెలిపారు.

తప్పిపోయిన కూతురు తల్లిదండ్రుల చెంతకు

అప్పగించిన సీడబ్ల్యూసీ అధికారులు


పాపను అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు

సిద్దిపేటరూరల్: గత సంవత్సరం తల్లితోపాటు హైదరాబాద్ వెళ్లిన చిన్నారి తప్పిపోయింది. ఎట్టకేలకు సీడబ్ల్యూసీ అధికారులు శనివారం తండ్రి, నానమ్మకు అప్పగించారు. హైదరాబాద్‌లో తప్పిపోయి శిశువిహార్‌కి చేరిన పాపను జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా పూర్తి వివరాలు సేకరించి, ఆ పాప సిద్దిపేట జిల్లాకు చెందినదిగా నిర్ధారణ చేసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు, నానమ్మను పిలిపించి బాలల సంరక్షణ అధికారులు విచారించి పాపను వారికి అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ రాజలింగం, సభ్యులు బాలచందర్, నర్సింహులు, అంజమ్మ, మంజుల, బాల రక్షాభవన్ సమన్వయకర్త మమత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము, సంరక్షణ అధికారి రమేశ్, చైల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురామ్


అందోల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): కరెన్సీ నోట్లపై డాక్టర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించేందుకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఆయన చేపట్టిన ప్రజాపోరు రథయాత్రను గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఫిబ్రవరి 1వ తేదీన విశాఖపట్నం బీఆర్ అంబేడ్కర్ భవన్ నుంచి ప్రారంభించారు. యాత్ర సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చేరుకుంది. అందోల్‌లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినట్లే నూతన పార్లమెంటుకు కూడా అంబేడ్కర్ పేరు పెట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి తమ ఎంపీలు పార్లమెంట్లో మాట్లాడేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, బాన్దావ్, మల్లన్న, సంజీవయ్య, గోపాల్, మోహన్, దేవదాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్ట్


గంజాయి ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు

రామాయంపేట(మెదక్): పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సీఐ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఎస్ఐ రంజిత్ తమ సిబ్బందితో దౌల్తాబాద్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. టీఎస్ 10 ఈఏ 5096 నంబర్‌గల కారు వేగంగా వస్తుండటంతో పోలీసులు అడ్డుకొన్నారు. కారులో తనిఖీచేయగా సీటు కింద 13 బస్తాల్లో దాచిన గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం నాగూర్‌బీ తండాకు చెందిన పవార్ రాజును, కర్ణాటక రాష్ట్రంలోని లచ్చిరాం తండాకు చెందిన సర్దార్‌గా గుర్తించారు. వారిని ప్రశ్నించగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం నుంచి తాము గంజాయిని తరలిస్తున్నట్లు అంగీకరించారు. మొత్తం 26 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్‌ఐతోపాటు కానిస్టేబుళ్లు మోహన్, రెడ్యా, రాజు, నాగభూషణం, సజీద్, లక్ష్మణ్, హోంగార్డులు సూర్యప్రకాశ్, లాల్‌సింగ్‌ను సీఐ అభినందించారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు పరిధిలో ఇద్దరు అదృశ్యమయ్యారు. వారిలో ఒకరు బీఎస్సీ విద్యార్థిని ఉంది. కాలేజీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అలాగే మాటలు రాని మహిళ ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. భర్త ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పటాన్‌చెరు టౌన్: బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ కు చెందిన నాగన్న కూతురు జ్యోతి సంగారెడ్డి లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఈ క్రమంలో 24వ తేదీన కాలేజీ వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియలేదు. కూతురు అదృశ్యంపై తండ్రి నాగన్న శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పద్మ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత కనిపించకుండా పోయింది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన మల్లికార్జున్ మేస్త్రీ పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మాటలు రాని భార్య పద్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పద్మ కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభిందలేదు. దీంతో భార్య అదృశ్యంపై భర్త మల్లికార్జున్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలిని వేధించిన హెచ్‌ఎంపై కేసు


యాదగిరి, సూరారం జెడ్పీస్కూల్ హెచ్‌ఎం

చిన్నశంకరంపేట(మెదక్): సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన ఓ ప్రధానోపాధ్యయుడు సహచర ఉపాధ్యాయురాలిని వేధింపులకు గురిచేయడంతో పోలీస్ కేసునమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సూరారం గ్రామ జెడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న యాదగిరి సహచర ఉపాధ్యాయురాలిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయంపై ఉపాధ్యాయురాలు గతంలోను షీ టీమ్‌ను ఆశ్రయించింది. షీ టీమ్ అధికారులు మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతం కావొద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా హెచ్‌ఎం తనతీరు మార్చుకోకపోవడంతో బాధితురాలు మరోసారి పోలీస్‌లను ఆశ్రయించింది. దీంతో చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.